# విశాలామురళీయం

వాసమూర్తి

## 1

అనగనగా ఒక కథానాయిక కాదు. ఈ మధ్యనే ఒకకథానాయిక. కథానాయిక అయినా పేరుమాత్రం ఏ మోహిని అనో రాగిణిఅనో చక్కగా తేలికగా ఉండక శ్రీలక్ష్మీ సరస్వతీ కాశీవిశాలాక్షీదేవి అని తెగబారెడుంది. ఉత్తపూర్వకాలపు పేరు. అందుకే ఆపేరంటే కథానాయికకు తగని అసహ్యం. అటువంటిపేరు పెట్టినందుకు తరుచు తల్లిదండ్రుల్ని తిట్టుకుంటూ వుంటుంది ఆమె. తల్లిదండ్రులయితేమాత్రం పిల్లలవిషయంలో సర్వస్వేచ్ఛ తీసుకోవడమేమిటి? కొంచెం ముందూవెనకా ఆలోచించవద్దూ? ఆ మొక్కంటూ, ఈ మొక్కంటూ, ఆ అమ్మమ్మ పేరనీ, ఈ నాయనమ్మపేరనీ, పేచీలుపడి చివరికి రాజీకి వచ్చి ఒక అతుకులబొంత నామధేయం తయారుచేసి, తగిలిస్తారు. అంతే, ఆపేరు చచ్చినాపోదు. ఆపేరుగలవారు పడేబాధ తల్లిదండ్రులేమైనా ఆలోచిస్తారా అని? అందులోనూ కథానాయిక పడేబాధ వర్ణించాలా? అయినా తెలివైనది కాబట్టి కథానాయిక తనపేరు చెక్కి చెక్కి చిన్నదిచేసుకుని విశాల అని వ్రాసుకుంటుంది. విశాల అంటేనే పలుకుతుంది. ఎవరైనా పొరపాటున చివరివరకూవచ్చి 'క్షి' అని నోరుజారారంటే వారినెత్తిన అక్షింతలు పడ్డాయన్నమాటే.

కథానాయికకు సినిమాలంటే-ముఖ్యంగా హిందీ ఇంగ్లీషు సినిమాలంటే-అపరిమితమైన ఇష్టమని వేరే చెప్పనక్కరలేదు. వాటిలోను కథానాయకుడు కథానాయికను గుర్రంమీద ఎక్కించుకునిపోయే దృశ్యాలున్నవి మరీని. ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం చదువుతోందికాని ఎన్నడు కాలేజిపుస్తకాలు ముట్టినపాపానపోదు ఆమె. ఒకవేళ ఎప్పుడైనా కాలేజీ పుస్తకం చేతిలోకి తీసిందంటే దానిలో ఒక చక్కనినవల దాచడానికి మాత్రమే. ఆమెకానవలా ఈనవలా అంటూ పెద్దవిచక్షణలేదు. ఒకకథానాయిక ఒక కథానాయకుడూ ఉండాలి. ప్రేమ ప్రతిపేజీలోనుంచీ తొణకాలి. అంతే ఆ లక్షణాలున్న ఏనవలఅయినా అవశ్య పఠనీయమే ఆమెదృష్టిలో. సినిమాలు తప్పకుండా చూడడం, నవలలు శ్రద్ధగా పఠించడం ఫలితంగా పగలే కలలుకనే అద్భుత ప్రజ్ఞ అలవడిందామెకు. చుక్కలరేడువంటి సుందరాకారుడొకడు తనప్రేమకోసం తపిస్తున్నట్లూ, తన ఆకర్షణశక్తికి తన సహాధ్యాయినులందరూ ఈర్ష్యతో కుమిలిపోతున్నట్లూ ఒక విలన్‌కూడా-విలన్ లేనిదే రొమాన్సు రక్తికట్టదుమరి!-తనను ప్రేమించినట్లూ, ఆప్రయత్నంలో విఫలుడై పగబూని దుర్మార్గానికి దిగినట్లూ, కథానాయకుడు సమయానికడ్డుకొని, అనేక కష్టపరిస్థితులలో విలన్‌నెదుర్కొని, పోరాడి, ఓడించి, తనను 'డ్యూక్ శెవెన్స్ మాడల్' కారులో ఎక్కించుకుని 'నైన్‌టీమైల్స్ స్పీడు' తో వెళ్లిపోతున్నట్లూ-అప్పుడు-అప్పుడు ఆ అనుభూతి ఆమెకే తెలియాలికాని వర్ణింపశక్యం మాత్రంకాదు. సమయానుకూలంగా సన్నివేశాలు మారుతూఉంటాయి. కథానాయకుని ఆమె ఒకమారు చిత్రకారునిగా ఊహించుకుంటే, మరొకమారు కవికిశోరునిగానూ, ఒకమారు 'ఎయిర్‌ఫోర్సు పైలట్' గానైతే, ఇంకొకమారు 'నేషనల్ లెఫ్టినెంటు' గానూ, ఒకపర్యాయం నటశేఖరునిగానైతే, వేరొకపర్యాయం ఆటలలో మేటిగానూ ఊహించుకుంటూ ఉంటుంది వైవిధ్యంకోసం. కథానాయకుడెవరైనా మన్మథాకారులుగా ఉండడంఖాయం. ప్రతికథా సుఖాంతంకావడంకూడా ఖాయం.-విశాలకు విషాదాంతాలలో నమ్మకం లేదు కాబట్టి.

ఏమైనా స్వప్న సీమలలో సంచరించే ఆమెకు ఇంటి పని అంటే ఇష్టమేముంటుంది చెప్పండి. అయినా తల్లి ఛాదస్తురాలు. కన్నకూతురు కదా అనే చనువుతో ఆపని చేసిపెట్టు అని అన్ని పనులూ తనే చేసుకోలేక చిన్న చిన్న పనులే చేయమని చెపుతుంది. కాని విశాల ఖచ్చితంగా వీలు లేదని చెపుతుంది. ఎప్పుడో కాళ్లావేళ్లాపడి ఈ వేళకు మాత్రం కాస్త అన్నం వండిపెట్టు, అవతల నాకు తలమున్కలుగా పని ఉంది. తల్లీ అని బ్రతిమాలితే విశాల వందసార్లు విసుగుకుంటూ వెళ్ళి పొయ్యి విసురుగావిసురుతూ కూర్చుంటుంది. పొయ్యిలో నుంచి వచ్చేపొగ చూసే టప్పటికి ఆమెకు మేఘాలు జ్ఞాపకం వచ్చి ఆమె వాటి మీద తేలిపోతుంది. ఇవతల అన్నం ఉడికి మాడి బొగ్గై అవతల ఇంటివారికి వాసన కొట్టినా విశాలమాత్రం ఇంకా విసురుతూనే కూర్చుంటుంది. తల్లి పరుగెత్తుకు వచ్చి నెత్తి మొత్తుకుంటూ తనే చచ్చినట్లూ మళ్ళీ మొదటినుంచీ వంట చేసుకోవలసి వచ్చేది. ఒకసారి ఎవరో "ఏమేవిశాలా, ఎలా చదువుతున్నావు? నీ పరీక్ష ఏ మవుతుంది ఈయేడు?" అని అడిగే టప్పటికి విశాల పరధ్యానంగా "పోతుంది" అని చెప్పివేసింది. వెంటనే నాలుక కరుచుకొని "ఎవరిది అడిగావు?-మా యింటి వెనకాలవారి అమ్మాయిదేమో ననుకున్నాను. నా పరీక్ష విషయంలో ఏమీ అనుమానం లేదు'' అని సర్దుకుంది. అనుమానం లేక పోవడం ఫెయిల్ అవడంలోనా, పాసవడంలోనా, అనేది తేల్చకుండా. కూతురి ఈవరస ఏమీ నచ్చక తల్లి ఒకరోజు విశాల నవలలన్నీ దాచివేసింది. కాని ఆవిడ వెన్ను తిప్పిందో లేదో ఇటు విశాల ఏ తలగడా క్రిందనుంచో, బీరువా సందులోనుంచో కొత్త నవలొకటితీసి కాలక్షేపానికి స్థిరపడేది. ఆమె పరధ్యానం శ్రుతి మించి రాగానపడి, అప్పుడు చెప్పినమాట అప్పుడే మరచిపోవడం, అన్నం తింటూనే ఏమి తిన్నదీ జ్ఞాపకం లేక పోవడం, తాళం చెవులు పెట్టెలోపెట్టి తాళం నొక్క

బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిస్టర్డు)
తెల్ల వెంట్రుకలను పోగొట్టును
రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము యిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగానెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-
GENERAL LABORATARIES,
(H. O) P.O. Rajdhanwar (H, Bag h).

# ★ విశాలా మురళీయం ★

చేయడం, ఒకరికి చెప్పవలసినమాట ఇంకొకరికి చెప్పడం మొదలైన లక్షణాలన్నీ ప్రారంభమయ్యే సరికి తల్లి బెంగపెట్టుకు పోయి ఆ అమ్మనీ ఈ అక్కనీ అందరినీ అడగడం మొదలు పెట్టింది. నూట ఒక్కరు నూట ఒక్క సలహాలు చెప్పారు. ఆఖరికి తల్లి తన కందుబాటులో ఉండే తెలుగు వైద్యుణ్ణి పిలిపించింది. ఆయన అరవైయేళ్ల ఆచారి. కనకాంబరం పూవు ముడిచిన పిలకా, నెలకోమారు క్షవరం చేయించుకునే అలవాటును బట్టి పెరిగిన గడ్డమూ, బోసినోరూ, ఒకవైపు తాడుతో కట్టుకున్న తెల్లఫ్రేములో చవాలు, తెల్లకోటు తెల్లకోటుమీద నస్యం మరకలూ ఆయనా . పిలుపందిందే తడవుగా ప్రత్యక్షమవుతాడు. ఆ తెల్లకోటు ఏ ఇరవై ఏళ్ళనుంచో వాడుకుంటూ వస్తున్నాడు. వైద్యానికి వెళ్లేటప్పుడే తొడుగుతాడు. కోటుంటేనే కాని తగిన ఠీవి రాదని ఆయన నమ్మకం. లోపల అడుగు పెట్టగానే మందుల సంచీ విప్పి కొప్పులూ, పొట్లాలూ తీసి, "అమ్మాయి కేమిటండీ పిలిపించారు. అన్నట్లు ఆ మధ్య మీ ఒంట్లో ఏదో నలతగా ఉండేదనుకుంటాను, నేను మందిచ్చాను గదూ వెంటనే పని చేసిందా, ఇప్పుడేమీ లేదు గదా-" అంటూ ఇంట్లో అందరిని గురించీ విపులంగా అడగడం మొదలు పెట్టే సరికి "అందరం కులాసాగానే ఉన్నాం ముందు అమ్మాయి చెయిచూసి చెప్పండి" అంది తల్లి. "ఆఁ ఆఁ అందుకే కదమ్మా వచ్చింది. ఏదమ్మా చిలకతల్లీ, ఇటురా, నీ కేమొచ్చిందమ్మా, బంగారు బొమ్మలాంటి దానివంటూ విశాలచేయిచూసి కొంచెం సేపు కళ్లుమూసుకొని తెరచి పెద్ద దోషం ఏమీ లేదమ్మా కొంచెం పైత్యం మాత్రం ఉంది. దానికి మందిస్తాను" అని పొట్లాలు విప్పి పొడుములన్నీ కలుపుతూ, నేటి వారు నాటు వైద్యాన్ని ఎలా చిన్న చూపు చూస్తున్నదీ, నాటు వైద్యంలో ఎంత గొప్ప ఉన్నదీ, తన తాత ముత్తాత లెలా చికిత్స చేసింది, తానెవరెవరికి ఎప్పుడెప్పుడేమి మందు లిచ్చినదీ, వాడవాడంతా తన కెంత పలుకుబడి ఉండేది, తనమాత్ర లెంత తక్షణ ప్రభావం చూపేదీ మొదలైన వాటిని గురించి బ్రహ్మాండమైన ప్రసంగం ప్రారంభించే సరికి అమ్మాయి పైత్యం మాట ఎలా ఉన్నా ఆచారిగారి పైత్యం మాత్రం భరింప రాకుండా ఉండడంచేత ఆయన చేతిలో ఒక అర్ధ రూపాయి పెట్టి ఎలాగో త్వరగా పంపించి వేయవలసివచ్చింది. ఆచారి మందు పట్టిచ్చిందో లేదో చెప్ప పనిలేదు కదా. ఇక తరువాత వంతు గ్రహవైద్యుడిది. అతడువచ్చి ఇంట్లో అందరికీ కూడా రక్షరేకులు కట్టించుకోవడం మంచిదని చెప్పి విభూతి ఉచితంగా యిచ్చి తన దక్షిణ తాను ముట్టజెప్పించుకొని చక్కాపోయాడు. ఈలోపుగా రాజమండ్రీ నుంచి తమ్ముడు రాగా, తల్లి తన తోబుట్టువు ముందు తన బాధవంతా వెళ్లబుచ్చుకుంది. తమ్ముడు "అయితే ఒకసారి నీరు మారితే ఏమైనా బాగుపడుతుందేమో, నాతోబాటు రాజమండ్రీ పంపించు" అని చెప్పేసరికి అలాగే పంపించింది తల్లి.

రాజమండ్రీకి వచ్చిందే తడవుగా విశాల బీరువాలూ, అలమారాలూ అన్నీ వెతికేసి దొరికిన నవలలన్నిటిని ఏరిపెట్టుంది. సాయంత్రం చక్కగా అలంకరించుకొని షికార్లకు పోతోంది. ఆ వేళ కూడా మామూలుగానే ఒక స్నేహితురాలింటికి వెళ్ళింది. కబుర్లు చెపుతూంటే కాలం ఎలా గడచిపోయిందో తెలియలేదు. అకస్మాత్తుగా ఆమెదృష్టి వాచీమీద పడింది. ఎనిమిదైందని చూసి కంగారుగా లేచి ఇంటికి బయలుదేరింది. సన్నని సందుగుండా పోతోంది. జన సంచారం అట్టే లేని చీకటి సందు. కాని విశాల అదేమీ గమనించకుండా హేండ్ బాగ్ ఊపుకుంటూ, ఆలోచనలతో తేలిపోతోంది. కొద్దిసేపటికి తన వెనకే ఏదో మరోనీడ వస్తున్నట్లయి తిరిగి చూసింది. గుండె ఆగిపోయింది ఏదో ఎత్తైన నల్లని విగ్రహం. నిశ్శబ్దంగా నడిచివస్తోంది. విశాల గుండె దడదడ కొట్టుకోసాగింది. త్వరత్వరగా ముందుకు నడిచింది కాని వెనకాల నీడలాగే వస్తోంది నల్లని విగ్రహం. అటువంటి పరిస్థితులే ఇదివర కెన్నో మార్లు కథల్లో చదివింది, కల్పనలలో ఊహించింది. కాని ఇప్పుడు వాస్తవంగా ఎదురొక్కవలసి వచ్చినప్పుడు మాత్రం కథలు చదివేటప్పుడుండే ఉత్సాహం, ఉత్తేజం ఏమీ కనిపించలేదు. ముందు ఈ నల్లనివిగ్రహం బారినుంచి బయటపడితే చాలునని పించింది. త్వరగా ఇంకొక సందులోకి నడచింది. అది అంతకన్న చీకటసందు. కాని ఆ సందు దాటితే మెయిన్‌రోడ్డు. నల్లవిగ్రహం బాగా దగ్గరకు వచ్చివేసింది.

## 2

రాజమండ్రీలోనే ఒక కథానాయకుడున్నాడు. కాని తాను కథానాయకుడనని అతనికి తెలియదు. కథానాయక లక్షణాలు కూడా పూర్తిగా పట్టలేదప్పటికి. ఇంకా చదువూ సంధ్యల్లో చాలా శ్రద్ధగలిగి ఉంటున్నాడు. పేరు మురళీ మోహనరావు బి. ఏ. రెండో సంవత్సరం చదువుకున్నాడు. అందగాడు. పూర్వకాలపు నాయకులకు విదూషకులు చెలికాళ్లుగా ఉన్నట్లే మురళీకికూడా ఒక చెలికాడున్నాడు. విదూషకులు భోజనప్రియులైతే మురళీ చెలికాడికి ఇడ్లీలంటే మిక్కిలి ఇష్టం. గుండ్రంగా పెరిగిన నిండైన విగ్రహమతనిది. అడ్డుకొలతలో అర్ధవ్యాసం అరగజ


దువ్వెనలోకి వూడివచ్చుటకంటే, తలపైఉండుట మేలుగదా



కేశవర్ధని తో

కేశములు రాలుట నిలుపండి. వ్యాధి ప్రసవము వల్ల, క్షీణించినచో జీవ తైలాలకుబదులు, కేశవర్ధనితో మీ కేశములనుపోషించండి తలలోదురదను, చుండును అరికట్టి. అకాలంలో నెరియుటను మాన్పించండి.



కేశవర్ధనితో కేశములపునర్జీవం పొందనివ్వండి. సువాసనకు, శుభ్రతకు షాంపూ వాడండి.

కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు.

నేషనల్ సేల్సు & సర్వీసెస్ (సదరన్) లిమిటెడ్. బకింగ్‌హాంపేట, బెజవాడ No 1.

# ★ విశాలా మురళీయం ★

మైనా ఉండవచ్చు. పేరుమాత్రం బుల్లబ్బాయి. మరళీ ఊరువాడే. తల్లిదండ్రుల కొక్కడే కొడుకు. గారాబంతో పెరగడం వల్ల పాతికేళ్లు వచ్చినా పెద్దవాడు కాలేదు. తల్లిదండ్రులు ధనవంతులు కాబట్టి 'మనకు చదువు లెందుకు నాయనా, హాయిగా ఇంటి దగ్గర తింటూ కూర్చోక' అని ఎంతగానో చెప్పారు. కాని బుల్లబ్బాయికి బి. ఏ. అనిపించుకోవాలని అభిలాష గాఢంగా ఉంది. అయితే బ్రహ్మదేవుడి పక్షపాతబుద్ధి కారణంగా అతనికా అభిలాషకు తగ్గ సామర్థ్యం లేకపోయింది. స్కూలులో చదువుతున్నంత కాలం. మాష్టర్లను భక్తితో సేవించి వాళ్ళ ఇళ్ళచుట్టూ ప్రదక్షిణంచేసి, పనసపండూ, మామిడిపళ్ళ బుట్టలూ పంపించి రెండో యేడైనా ప్యాసు చేయించుకుంటూ పైకి వచ్చాడు. స్కూలు ఫైనలులో నాలుగేళ్లు తప్పవేశాడు. నాలుగోయేడు ఎగ్జామినర్లందరినీ సందర్శించి, అష్టదిగ్బంధనం చేసి పరీక్షా మహాభూతాన్ని ఓడించి వేసి కాలేజీలోకి వచ్చిపడ్డాడు. మురళిని పట్టుకున్నాడు 'నీవే నేను పాసయ్యే ఉపాయమేదో చేయాల'ని. ఇద్దరూ ఒక గదిలోనే ఉంటూ చదువుకున్నారు. మురళీ చదువు నూరినూరి బుల్లబ్బాయి బుర్రలో పోయడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని అది వృధా అని తెలియడానికెంతోకాలం పట్టలేదు. అయినా పట్టు విడిచేవాడు కాడు మురళీ. బుల్లబ్బాయి ఎందుకైనా మంచిదని యీ మధ్య అంజనేయస్వామి ఆలయానికి కూడా వెళ్ళి వస్తున్నాడు. స్వామికి వేయి కొబ్బరికాయ లాశపెట్టి వచ్చాడు. 'లక్కీ' ఉంగరం తెప్పించుకొని వ్రేలికి పెట్టుకున్నాడు. మిత్రులిద్దరూ రోజూ గోదావరి ఒడ్డుకు పోయి చీకటిపడే వరకూ ఏ శ్రద్ధానందఘాట్‌లోనో కూర్చొని లేచి, హోటలులో భోజనం చేసి, బసకు చేరుకుని చదువుల్లో పడుతూ ఉంటారు. ఆవేళ కూడా గోదావరిమీద పిల్ల తెమ్మెరలకు మనస్సులు చల్లార్చుకొని, తరువాత హోటలులో తృప్తిగా భోజనంచేసి ఇంటి దారి పట్టారు. కొద్ది దూరం నడిచేసరికి కెవ్వుమని కేక వినిపించింది. కేక విన్నాడంతే. మురళీ కథానాయకుడై పోయాడు. సందులోకి పరుగెత్తాడు. ఒక యువతి వణుకుతూ నిలబడిఉంది. ముందెవరో ముసుగు మనిషి 'హుం' అంటున్నాడు భీకరంగా. యువతి మెడలో చేయిపెట్టుకుంది గొలుసు తీయడానికి కాబోలు. మురళీ వెంటనే గ్రహించి వేశాడు పరిస్థితి. వెళ్ళి నల్లని విగ్రహం మీద పడ్డాడు. ఆ నల్లని వ్యక్తి మురళీని ఒక్క విదుల్పు విదిల్చి మళ్ళి యువతిని బెదరిస్తున్నాడు. "ఊఁ త్వరగా" అంటున్నాడు. కథానాయకుడు మళ్ళి విజృంభించాడు. మళ్ళి వెనక్కి నెట్టివేయబడ్డాడు, అయినా కథానాయకు డూరుకోగలడా, ఒక యువతి ప్రమాద పరిస్థితిలో ఉండగా. మళ్ళి ఉరికాడు ముందుకు. నల్ల విగ్రహం కదలక తప్పిందికాదు. ఇద్దరూ కుస్తీకి దిగారు. కథానాయకుడి పని సంకటంలో పడింది. బుల్లబ్బాయి పంట్లాము పైకి పట్టుకొని సందు చివరకు పరుగెత్తాడు ఎందుకేనా మంచిదని. కాని మురళీ ఇప్పుడు, కథాకాయకుడు కాబట్టి అతనిలో ఆవేశం, రోషం పొంగిపోతుండడం వల్ల పెనుభూతంలా పోరాడి ఎలాగో ఆ నల్లని వ్యక్తిని తరిమివేసి తన కథానాయకత్వం ఋజువు పరచుకున్నాడు. భేష్ భేష్ అంటూ బుల్లబ్బాయి తిరిగి వచ్చాడు. కథానాయికా, కథానాయకుడూ ఒరిక నొకరు పరిచయం చేసుకున్నారు. 'విశాల' ముచ్చటగా మూడే అక్షరాలతో ఎంత ముద్దుగా ఉంది పేరు; 'మురళీ మోహనరావు' 'ఎంత చక్కని పేరు: మురళీ అన్నా, మోహన్ అన్నా, రావుఅన్నా, మురళీ మోహన్ అన్నా ఏ విధంగానైనా ఎంత ఆకర్షకంగా ఉంది. బి. ఏ. రెండో సంవత్సరం చదువుతున్నవాడు. అందగాడు. నల్లని వ్యక్తిని తరిమివేసిన సాహసి! ఇంకేముంది. కథానాయికకు కథానాయకుడూ, కథానాయకుడికి కథానాయికా దొరికారు. బుల్లబ్బాయికూడా తన్నుతాను కథానాయకుడి చెలికాడుగా పరిచయం చేసుకున్నాడు. ముగ్గురూ ముందుకు నడిచారు.


ఉచిత బహుమానం !



నం. 501 తలనూనె వుపయోగించువారి జుట్టు విరివిగా పొడుగుగా అందముగా కుమ్మెరదకలై యుండును.

ఒకసీసా రు. 2-8-0; 3 సీసాలు రు. 6-8-0

ఒక్క బాటిలు కొంటే 15 సం॥ గ్యారంటి రిష్టువాచి, ఒక క్రొత్త బంగారు వుంగరం బహుమానం 3 సీసాలు ఒక్కసారి కొంటే నాల్గు రిస్టువాచీలు, 4 వుంగరాలు బహుమానం. ఇందులో ఏది వచ్చునన్నా ధర వాపస్.

Saniyasi Ayurvedic Pharmacy,

(A.P.M.) P. B. 1397, Delhi.

కొత్తదార్లు తమఅడ్రెస్ ఇంగ్లీష్‌లో వ్రాయాలి:


రాజకీయ నాయకుడు ఉపన్యసిస్తూ "మనం ప్రారంభించిన పంచవర్ష ప్రణాళిక అద్భుతంగా విజయంపొందింది. ఈ ప్రణాళికవలన మనం ఆహార ధాన్యాలు బాగా పండించుకోగలిగాం. వరిపంట ఇదివరకటికంటె పెరిగింది..." అని చెబుతుండగా శ్రోతల్లో ఒకడు "గడ్డి?" అని వేళాకోళంగా అడిగాడు.


"నేను ఇప్పుడు మనుష్యులకు అవసరమైన పదార్థాల్ని గురించి మాట్లాడుతున్నాను. దీనితర్వాత మీకు సంబంధించిన విషయానికి వస్తాను," అని ఆయన సమాధానం చెప్పాడు.

కథానాయకుడు కథానాయికను ఆమె మేనమామ యింటి వరకూ సాగనంపి వచ్చాడు. పుస్తకం తీశాడు. అక్షరాలు కనిపించలేదు. విశాల విశాలనేత్రాలూ, లే.గులాబి పెదవులే కనిపిస్తున్నాయి. చెవిలో ఆమె తీయని కంఠమే వినిపిస్తోంది. మురళీ హృదయంలో నుంచి కవితాధార ఒక్కమారుగా పైకి చిమ్మింది. బుల్లబ్బాయిని కాగితం కలం తీయమన్నాడతను వెంటనే. ఎందుకన్నాడు బుల్లబ్బాయి. 'ఎదురు ప్రశ్న వేయక నేను చెప్పినది వ్రాయ'మని శాసించాడు మురళీ. 'ఓ విశాలా, నా విశాలా, అంటూ మొదలుపెట్టాడు. బుల్లబ్బాయి హడలిపోయాడు. "అయ్యో ఇదేమిటెరా బాబూ అది తగిన వాళ్ళకేగాని నీకూ నాకూ పసిదురా బాబూ ఈ కవిత్వం" అని ఎంతో బ్రతిమాలాడు కాని మురళీ వింటేగా. ఇంకా క్రొత్త కవిత్వం కాబట్టి ప్రతిపాదంలోనూ విశాల పేరే పునర్చరణ కాసాగింది. ఎలాగో కొంతసేపటికి లైటార్పివేసి మురళిని పండుకోజేశాడు బుల్లబ్బాయి. కాని రాత్రి మురళీ పలవరింతలలో ముప్ఫైసార్లైనా లెక్కపెట్టాడు విశాల పేరు. ఎలాగో తెల్లవారింది. విశాల వర్ణనతో చెవులు తడకలు కట్టడం మొదలుపెట్టాయి. విశాలా జ్వరం వచ్చినప్పటినుంచీ మురళీ మళ్ళి పుస్తకం ముట్టలేదు. "ఒకే పెద్ద పరీక్ష

# ★ విశాలా మురళీయం ★

లురా ముందున్నవి. దగ్గర పడుతున్నా యిరా" అని బుల్లబ్బాయి మొత్తుకున్నా మురళీ మెదడుకెక్కడం లేదు. కిటికీలో కూర్చొని "శూన్యం" కేసి చూస్తున్నాడు. "అయితే నన్ను గోదావరిలో దింపావన్నమాటే" అని బుల్లబ్బాయి దిగులుతో చతికిల బడ్డాడు. సాయంత్రం మురళీ బులబ్బాయిని తీసుకొని బయలు దేరాడు విశాల దర్శనం కోసం. ఇదే సమయం. కాసేపు చెవులు తుపాకులు కట్టడం తగ్గుతుందని ఉత్సాహంతో నేబయలు దేరాడు బుల్లబ్బాయి. ఎక్కడా విశాల తటస్థపడలేదు. విశాలను చూడకుండా ఉండలేక ఆమె ఇంటికి నడిచాడు మురళీ, రొప్పుతున్న బుల్లబ్బాయిని వద్దన్నా కూడా లాగుకుపోతూ. ఇంటికి పోయే సరికి విశాల మేనమామే కాబోలు వీధిగుమ్మంలో నిలబడి ఉన్నాడు. అందువల్ల దూరంనుంచే వెనక్కు తిప్పుకొని ఆనాటికి నిరాశతో తమగదికి మరలవలసి వచ్చింది. మురళీ ఆరాత్రి సరిగా భోజనమైనా చేయలేకపోయాడు. మర్నాడు ప్రొద్దున్న "ఎమైనాసరే ఈ వేళ విశాలనొక్కమారు చూడనిదే మరలిరానని" ఒట్టు వేసుకొనిపోయి మురళీ విశాల మేన మామగారి యిల్లు కాపలా కాశాడు. తపస్సు ఫలించి దేవతా దర్శనం అయింది. తృప్తితో తిరిగివచ్చాడు. సాయంత్రం మళ్లా కలుసుకున్నారు కథానాయికా నాయకులు. మళ్లీ మళ్లీ కలుసుకుంటున్నారు కూడా. మురళీ మంచి హుషారుమీద ఉంటున్నాడు. పరీక్షలకు నీళ్లు వదులుకున్నాడు బల్లబ్బాయి. పై పెచ్చు మురళీ కవిత్వం "రికార్డు" చేయడంలో మతిపోయేటట్లుంది అతనికి. కాని ఏం చేస్తాడు. ప్రాణస్నేహితుడు ప్రేమ ప్రవాహంలో పడి కొట్టుకుపోతూంటే బాధ పడుతూ అతని నే పట్టుకు ప్రేలాడుతున్నాడు ఎప్పటికైనా దరిచేర్చలేక పోతామా అని. ఇటు నాయికా నాయకుల ముచ్చట్లు మీటింగులు మోతాదు దాటుతున్నాయి. కాని కొన్ని కొత్త పరిస్థితులు వచ్చాయి. గాలివానావస్తే కథే లేదంటారు కాని అంతా సాఫీగా నడచిపోయినా కథే లేదని చెప్పాలి. నాయికా నాయకులు కలుసుకోవడానికి ఇప్పుడు చిక్కులు బయలుదేరుతున్నాయి "అదుగో, విశాల వెళ్ళి మాట్లాడుదాం" అని మురళీ దగ్గరకు పోయేసరికి విశాల అతనికేసీ చూడకుండా వెళ్లిపోతోంది. కారణ మేమిటా అని ఆలోచిస్తూ చూసేసరికి విశాల ప్రక్కన తెల్ల ముసుగని తేలింది.

ఇంతలో దుష్టపాత్ర రంగంమీదికి దుమికాడు. దుష్టపాత్ర ఎవడో కాదు విశాల మేనత్తకొడుకు లక్ష్మీనారాయణ. ఆ ఊళ్లోనే ఉంటున్నాడు. ఎస్. ఎస్. ఎల్. సి. పాసయ్యేందుకే తలప్రాణం తోకకు వచ్చినట్లయి అక్కడితో చదువు చాలించి ప్లీడరు గుమాస్తాగా చేరాడు, పెద్దస్థితివాడు కాదు కాబట్టి. అతనికి చూపంతా విశాలమీదే ఉంది. తన తక్కువస్థితి కారణంగా మేనమామ అయినప్పటికీ విశాల తండ్రి ఆమెను తనకివ్వడమనేది కలలోనిమాట అని అతనికి తెలుసును. అయినా విశాలకనక ఒప్పుకుంటే ఆమె తల్లిదండ్రులచేత కూడా ఒప్పించవచ్చని అతని ఆలోచన. పైగా తన రక్త సంబంధంవల్ల విశాలమీద తనకు దేవుడిచ్చిన అధికారముందని అతనికొక ధీమా. విశాలను వెన్నంటి వేధించడం మొదలు పెట్టాడు బజారుకుపోతే బజారుకు సిద్ధం. సినిమాకుపోతే సినిమాకు తయారు. పదే పదే పలురకాల ప్రకటనలతో ప్రజల మనస్సుల్ని వశం చేసుకొనే నేటి 'అడ్వర్ టైజర్ల' పద్ధతి అవలంబించ సాగాడు. విశాలకోసం పువ్వులు కొని తెస్తున్నాడు. పొగస్తంభాలలో ఉక్కిరి బిక్కిరిచేస్తున్నాడు. కూల్ డ్రింకు లిప్పిస్తున్నాడు. వీలు చిక్కినప్పుడల్లా ప్రేమ ప్రకటిస్తున్నాడు. విశాల తన 'ప్రెషర్ టాక్టిక్స్'కు లొంగిపోతుందని అతని విశ్వాసం. ఆ విశ్వాసంలో అతి చనువుకూడా తీసుకుంటున్నాడు. తెలియనట్లుగా చేయితాకుతున్నాడు. చూడనట్లుగా మీదకు వస్తున్నాడు. ఆ వేళ సినిమానుంచి లేస్తూంటే జనం దూరంగా ఉండటం చూసి చేయిపట్టుకున్నాడు. విశాల విదిలించుకోబోయింది. కాని గట్టిగా పట్టుకొని తనను కనికరించమన్నాడు. ప్రేమించమన్నాడు పెళ్లి చేసుకోమన్నాడు. విశాల చేయివదలకపోతే గట్టిగా అరుస్తానంది, ఏమైనా విడనన్నాడు లక్ష్మీనారాయణ అదేసమయంలో కథానాయకుడు మురళి చెలికాడు బులబ్బాయితో అటు వచ్చాడు. తన కళ్ళయెదుటే తన ప్రేయసిని ఎవడో గూండా బలాత్కారం చేయబోతే కథానాయకుడూరుకోగలడా? వెంటనే వెళ్లి మెడపట్టుకున్నాడు. లక్ష్మీనారాయణ మొదట్లో కొవ్వుమీరి కేక వేసి కథానాయకుడివైపు తిరిగి "నువ్వెవడివిరా, రాస్కల్ నన్ను పట్టుకోవడానికి, వదులు" అని అరిచాడు. "నువ్వెవడివిరా ఆ అమ్మాయి చేయి పట్టుకుంటావు" అని గర్జించాడు కథానాయకుడు. "నువ్వెవడివిరా ఆ అమ్మాయి విషయం పట్టించుకుంటావు" కన్నాడు దుష్టనాయకుడు లక్ష్మీనారాయణ ఇద్దరూ ఒకరి చొక్కా కాలరు ఒకరు పట్టుకున్నారు. విశాల తెల్లబోయి చూస్తోంది. కాని వెంటనే తేరుకొని అంతకుముందు వల్లని వ్యక్తిని తరిమివేసిన మురళి ఇప్పుడు లక్ష్మీనారాయణను లక్ష్మీనారాయణగా ఉంచు



వాడో ఉందడో అని భయంవేసి "వదులు, మురళీ, అతను మా మేనత్త కొడుకు లక్ష్మీనారాయణ" అంది దానితో కథానాయకుడికి గుండె ఆగిపోయినంత అయింది. లక్ష్మీనారాయణను వదిలి వెర్రిమొగం వేసుకొని చూస్తూ నిలబడ్డాడు లక్ష్మీనారాయణకు ఊపిరి అంది ధైర్యం తిరిగి విజృంభించింది. "రారా, రాస్కెల్ నిన్ను చిత్రహింస చేయకపోతే నా పేరు లక్ష్మీనారాయణ కాదు. రారా దమ్ములుంటే" అంటున్నాడు బుల్లబ్బాయి మురళీని వెనక్కి లాగడం మొదలుపెట్టాడు మురళీ అలాగే మాట్లాడకుండా వెనక్కి తిరిగి తలవంచుకుని నడవసాగాడు లక్ష్మీనారాయణ విశాల వైపుకు తిరిగి "వీడితో నీకేదో ఉందన్నమాట ఉండు నీ సంగతి మీ మామయ్యతో చెప్పకపోతే" అన్నాడు. "నువ్వు చేయబోయింది కూడా మా మామయ్యతో చెపుతానం'ది విశాల దుష్టనాయకుడిని ధైర్యంగా ఎదుర్కొనే కథానాయికలా. ఇద్దరూ మాట్లాడకుండా ఇంటికి చేరారు దుష్టనాయకుడి దుర్బుద్ధి ఎక్కడకు పోతుంది మర్నాడు ప్రొద్దున్న రహస్యంగా విశాల మేనమామతో విశాల ఎవడితోనో చనువుగా ఉంటోందని చెప్పారు దానితో ఆయన హడలిపోయి, ఏమైనా వస్తే తన నెత్తిమీద పడుతుందనుకుని అప్పటికప్పుడు విశాలను కాకినాడ బండి ఎక్కించి వచ్చాడు.

## 3

మర్నాటినుంచి కథానాయకుడికి ప్రేయసి దర్శనం కాలేదు విశాల వెళ్ళిపోయిందని తెలిసింది. మురళీ పూర్తిగా నిరాశలో మునిగిపోయాడు ఇక విశాల తనకు కాదనుకున్నాడు. విశాల లేనిదే ఈ ప్రపంచంలో బ్రతకడ మెలా? ఒకటి రెండుసార్లు గోదావరిమీద అతని దృష్టి పడింది కాని బుల్లబ్బాయి జాగ్రత్తగా అతని నిరాశనంతా కవిత్వంలోకి మళ్ళించవేశాడు.

పరీక్షలు వచ్చాయి మురళీ 'ప్రేయసి లేనిదే బ్రతుకెందుకు? బ్రతుకెందు కనుకున్నప్పుడు పరీక్షలెందుకని వైరాగ్యంలో పడ్డాడు కానిఎలాగో దిటవు తెచ్చుకుని పరీక్షల ముందుకొంచెం చదివి పరీక్షలకు కూర్చున్నాడు బుల్లబ్బాయికి తన పరీక్షా ఫలితం ముందే తెలుసు. కాబట్టి పరీక్షల రోజుల్లో జ్వరం తెప్పించుకుని పడుకున్నాడుట—ఎవడేనా అడిగితే 'జ్వరం వచ్చి మానివేయవలసి వచ్చింది. లేకపోతే ఫస్టుగా పాసైఉండును' అని చెప్పుకోవచ్చు కాబట్టి పరీక్షలవగానే వైరాగ్యంలో పడిపోయిన మురళీని తీసుకొని స్వగ్రామం చేరాడు బుల్లబ్బాయి.

## 4

విశాల వైఖరి ఎప్పటిలాగే ఉండడం చూసి తల్లి పూర్తిగా బెంగపెట్టుకుంది. భర్తను బ్రతిమాలింది "త్వరగా ఏవైనా సంబంధాలు చూడండి. దీని వరస చూస్తే రేపెవడూ పెళ్ళి చేసుకోకపోవచ్చు. నలుగురిలోనూ అప్రతిష్ఠగా కూడా ఉంటుంది. త్వరగా పెళ్ళి చేసేస్తేనేకాని దీని వరస బాగుపడేటట్లు లేదు" అని. ఆయన అలాగేనని సంబంధాలు చూడడం ప్రారంభించాడు కాని ఏ సంబంధం తీసుకువచ్చినా "నాకీ సంబంధం నచ్చలేదు, నేను చేసుకోను" అని తోసివేస్తోంది విశాల సంబంధాల వారిని మాపులకని ఇంటికి పిలిచి చెప్పి పంపిస్తే బాగుండదని, పెళ్ళికొడుకుల ఫొటోలు ముందు తెప్పించి కూతురుని చూసి చెప్పమంటున్నారు విశాల తండ్రి. విశాల ఆ ఫొటోలకేసి చూడడం లేదు. చూడకుండానే నచ్చలేదని చెప్పేస్తోంది ఈ సమయంలో లక్ష్మీనారాయణ అక్కడకు చేరాడు. మేనమామతో తన ప్రస్తావన తెచ్చాడు. ఆయన పెద్దగా నవ్వివేసి ఊరుకున్నారు.

ఎలాగైనా దుష్టనాయకుడు తనకు కాకపోతే పోనీ, మరొకరికేనా కాకుండా చేయాలనే దుర్బుద్ధితో విశాలకు వచ్చే సంబంధాలను చెడగొట్టాలని తలపెట్టాడు లక్ష్మీనారాయణ కాని తన ప్రయత్నం అవసరం లేకుండానే విశాలే అన్ని సంబంధాలను తిప్పివేస్తోంది. ఆమె మనస్సు వాడెవడిమీదో ఉంది కాబోలు, వాడి విషయమే చూడాలనుకున్నాడు. అలాగే అతనుండగానే మురళీ ఫొటో తీసుకువచ్చారు విశాల తండ్రి, ఎవరో మురళీ సంబంధం మంచిదని చెపితే అతని ఫొటో తెప్పించి కూతురుని చూడమని బల్లమీద పెట్టి వెళ్ళారు. అది మురళీ ఫొటో అయిఉంటుందని విశాల కలలోనైనా ఊహించలేదు. కాబట్టి ఆఫొటోకేసే చూడకుండా ఊరుకుంది. కాని ఫొటోను చూసి గుర్తించాడు లక్ష్మీనారాయణ పొరబాటునైనా విశాలదృష్టిలో అది పడితే ప్రమాదమని లక్ష్మీనారాయణ మెలగా ఆ ఫొటో దాచివేసి మరొక అనాకారుడిఫొటో పెట్టాడు తల్లి "ఫొటోలు చూడడానికేమే! చూడకుండానే నచ్చలేదంటే ఎలాగే అమ్మాయి! చూడు, నచ్చకపోతే చేసుకోమని ఎవరంటారు" అని చెప్పగా విశాల వచ్చి బల్లమీద ఫొటో చూచి మూతిముడుచుకొని, కళ్లుమూసుకొని చక్కా పోయింది. మేనమామ తీసుకునే సమయానికి మాత్రం మామూలు ఫొటో పెట్టివేశాడు లక్ష్మీనారాయణ "ఏం అమ్మాయి ఈ పిల్లవాడేనా నచ్చాడా?" అని తండ్రి అడగగా "నచ్చలేదని ప్రత్యేకంగా చెప్పాలేమిటి" అని విసుగా సమాధాన మిచ్చింది విశాల. తండ్రి కోపంతో "నీకు భూమిమీద సంబంధాలేవి నచ్చేటట్టు లేవు. ఆఖరికి నాకు ఒళ్ళుమండుకువస్తే ఈ లక్ష్మీనారాయణకే ఇచ్చివేస్తాను" అని కేకలు పెట్టారు. తన రొట్టె నేతిలో పడిందనుకున్నాడు లక్ష్మీనారాయణ విశాల తనకు నచ్చినవాడిని తప్ప మరొకడిని చేసుకోదు. ఇప్పుడు ఆవచ్చిన వాడి సంబంధం కూడా పోగొట్టుకుంది ఇక విశాలకు వేరేవిధంగా పెళ్లికాదు చివరికి తనదగ్గరకే రావలసివస్తుంది అని ఊహించుకుని, తన పథకం పారింది కాబట్టి తానక్కడ ఉండవలసిన పనిలేదని వెనక్కి వెళ్ళిపోయాడు.

విశాల మెల్లగా తల్లిదగ్గరకు చేరి "అమ్మ నాన్నతో చెప్పి ఈ సంబంధాలకోసం వెతకవద్దనవే" అనిచెప్పి తానొక కుర్రవాడిని ప్రేమించాననీ, అతనినే పెళ్ళిచేసుకోవాలనుందని గొణిగింది. తల్లి నోరు తెరచుకొని, బుగ్గలు నొక్కుకొని, ఉండిపోయింది. తరువాత కూతురుని తియ్యగా చీవాట్లు పెట్టింది. కాని కూతురు కన్నీరు చూసి కరిగిపోయి భర్తతో సిఫార్సు చేయడానికి ఒప్పుకుంది. విశాలతండ్రి విషయం తెలుసుకోగానే నిలువెత్తున లేచారు. ఆయన కేకలతో పెంకులు లేచిపడ్డాయి. విశాలకూడా పిల్లికూన అయిపోయింది "చివరికా లక్ష్మీనారాయణ గాడికే ఇచ్చిచేసేస్తాను దానితో రోగం కుదురుతుంది" అని మళ్లీ బెదరించి కండువా వేసుకోకుండానే వీధిలోకి వెళ్ళిపోయాడు. ★

(మిగతాకథ పైవారం)




## నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము నీరసము, విస్మృతుల వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20తు డబ్బీ రు, 3-4-0 పోస్టేజీ అ 15.

పి. సి ఏ అండ్ కో, పెరిదేపి, నెల్లూరుజిల్లా.





10,000 వాటర్ ప్రూఫ్, 17 జ్యూయల్సు వాచీలు ఉచితంగా పంచిపెట్టబడును. ఉచిత గిటకేచర్ కు, కాలెండర్ కు వ్రాయండి

SWISSCO (IND),
P B 110030, Bombay-I.

# విశాలామురళీయం

(గతసంచిక తరువాయి)

**5**

ఇటు కథానాయకుడికికూడా చాలా సంబంధాలు వస్తున్నాయి. అతనూ అన్ని సంబంధాలూ కాదంటున్నాడు. తల్లితో తనగొడవ చెప్పుకుని తండ్రిదగ్గర మధ్యవర్తిత్వం చేయమని బ్రతిమాలాడు. ఆవిడ మధ్యవర్తిత్వం ఫలితంగా ఊళ్లోవాళ్లందరూ కంగారుగా పరుగెత్తుకువచ్చారు "ఏమిటీ, ఏం జరిగిందంటూ." "ఇలాంటి వెర్రి వేషాలు వేస్తే నా ఆస్తిలో ఒక చిల్లిగవ్వ నీకియను. పో, నా ఆస్తి అక్కరలేకపోతే పోయి ముగ్గురుపిల్లలున్న వెధవదాన్ని చేసుకో నా కభ్యంతరంలేదు" అని అరిచాడాయన. మురళీమొగం పాలిపోయింది.

ఈ గొడవలో రామాయణంలో పిడకల వేట అన్నట్టు బుల్లబ్బాయికో సంబంధం వచ్చింది. ఏభైవేలు కట్నం. తల్లీ, తండ్రీ, కొడుకూ వెళ్లి పిల్లనిచూసి మెచ్చుకున్నారు. నల్లని సిద్దిరూపం, 'స్థూలతమ' కాయం, పైకి పొడుచుకువస్తున్న తెల్లనిపళ్ళూ, మెల్లకళ్లూ ఆ పిల్లని చూడ వెళ్లిన బండిలోనే వెనక్కి తిరిగివచ్చారు. వచ్చిన తరువాత మూడు లంకణాలు చేశాడు బుల్లబ్బాయి.

మూడురోజుల తరువాత మురళీ దగ్గరకు వచ్చాడు బుల్లబ్బాయి. మురళీ తన మనోవేదన అంతా వెళ్లబుచ్చాడు. అతని నిట్టూర్పులు చూసి వెంటనే ఏదో ఉపాయమాలోచించకపోతే మురళీ నిజంగానే వేదాంతి అయిపోయేటట్టున్నాడని గ్రహించి కాకినాడ పోదామన్నాడు బుల్లబ్బాయి. అలాగే ఇద్దరూ ఇంటిదగ్గర ఏదో సాకుచెప్పి కాకినాడ చేరుకున్నారు. ఊళ్ళో రోడ్లు కొలవడం మొదలుపెట్టారు. చివరికి విశాల ఇల్లు కనుక్కున్నారు. ఇల్లు కనుక్కోవడమే కాదు. విశాలనే కలుసుకోగలిగారు. మురళీని చూసి విశాలకు ప్రాణం లేచివచ్చింది. విశాలను చూడగానే మురళీ వైరాగ్యం వదిలిపోయింది. రెండు హృదయాలూ ఏవేవో చెప్పుకున్నాయి. బుల్లబ్బాయి దూరంగా నిలబడి చెట్లమీద కాకుల్ని లెక్కపెడుతున్నాడు. నాయికానాయకులు చివరికి భూమిమీదికి దిగారు. తామిలా ఎప్పుడూ ప్రేమ ప్రకటనలతోనే తరిపుచ్చుకోవలసిందేనా. తన తండ్రినిగురించి చెప్పుకుంది విశాల. మురళీ తనగొడవ చెప్పుకున్నాడు. మరి ఏం చేయాలి? ఎంత ఆలోచించినా ఏ ఉపాయమూ తోచలేదు. మురళీ నిస్పృహతో ఎందరో ప్రేయసీప్రేమికులు చేస్తున్నట్టుగా ఇద్దరూ కలిసి 'ఏ విషమో — ఏ చెరువో'-అంటున్నాడు. విశాల గజగజలాడిపోయింది. చెప్పడమంటే చెప్పాడు కాని చెపుతూంటేనే చెమటవచ్చింది మురళీ కోట్లోకూడా. పోనీ ఇద్దరమూ ఎవరికీ తెలియకుండా లేచిపోయి ఎక్కడో 'రిజిస్టరుమారేజి' చేసుకొని హాయిగా జీవితం గడుపుదామన్నాడు. కథలలోనూ కలలలోనూ అటువంటి సన్నివేశాలు ఉత్సాహముతో ఊహించింది కాని క్రియకు వచ్చేటప్పటికి భయం ముంచెత్తింది విశాలకు. తల్లిదండ్రులు లేకుండా పెళ్లా? విశాల

## వాసమూర్తి

'అవ్వా కావాలి బువ్వా కావాలి' ధోరణి చూసి మురళీకి కొంచెంసేపు మనస్సు పని చేయలేదు. మళ్లీ ఒక కొత్తఉపాయమాలోచించాడు. 'రిజిస్టరుమారేజి చేసుకోనక్కరలేదు. తల్లితండ్రులముందే అగ్నిసాక్షిగానే పెళ్ళిచేసుకోవచ్చు-ఒకటిచేస్తే' అన్నాడు. 'ఏమిటది' అంది విశాల. తనూ బుల్లబ్బాయి ఒక నిర్ణయించుకున్న రోజున ముందుగా నిడదవోలు పోయివుంటారు. ఆపైన విశాల రాజమండ్రీలో మేనమామ యింటికి వెళ్లివస్తానని చెప్పి తిన్నగా నిడదవోలు వచ్చి చేరాలి. అక్కడినుంచి ముగ్గురూ గుంటూరు వెళ్ళిపోవాలి. తన తలిదండ్రులు తనకోసం చాలా కంగారుపడతారు. బెంగ పెట్టుకుంటారు. పశ్చాత్తాపపడతారు. తమ పిల్లలు తిరిగివస్తే చాలు. వాళ్ళ ఇష్టం వచ్చినట్లే చేస్తామనే పద్ధతికి వస్తారు. అప్పుడు - అంటే గుంటూరుచేరిన ఒక వారం రోజుల తరువాత ఇంటికి ఉత్తరం రాయాలి. "తమ ఇష్టప్రకారం చేసేటట్లవుతే ఇంటికి తిరిగి వస్తా"మని. తలిదండ్రులలాగే ఒప్పుకుంటారు. అప్పుడు ఇంటికి తిరిగివచ్చి కోరిక నెరవేర్చుకోవచ్చునని పథకం విస్తరించి చెప్పాడు మురళీ. తలిదండ్రులు ఒప్పుకుంటారా అంది విశాల. ఒప్పుకుంటారన్నాడు మురళీ. పోలీసులకి రిపోర్టు చేయరా అంది. చేయరన్నాడు మురళీ. చేస్తే తమకే అప్రతిష్ఠ అని నలుగురికీ తెలియకుండానే ఉంచడానికి ప్రయత్నం చేస్తారన్నాడు. విశాల ఆలోచించింది. నిశ్చయానికి రాలేకపోయింది. బుల్లబ్బాయినికూడా సలహాకు పిలిచారు. "ఓ యస్ బ్యూటిఫుల్ గా ఉంది ప్లాను. మురళీ అంటే ఏమిటనుకున్నావు" అన్నాడు బుల్లబ్బాయి. చివరకు విశాల అంగీకరించింది. ప్లాను సరిచేశారు. ఇంకా ఆలస్యంచేస్తే తండ్రికి సంజాయిషీ ఇవ్వవలసివస్తుందని విశాల ఇంటికి పరుగెత్తుకుపోయింది.

అనుకున్న రోజున మురళీ బుల్లబ్బాయి నిడదవోలు చేరుకున్నారు. అనుకున్న వేళకు బండికోసం ఎదురుచూశారు. బండి వచ్చింది కాని విశాల కనిపించలేదు. కొంతసేపటికి తమ ఎదురుగావున్న పెట్టెలోనే విశాల ఉందని చూసి లోపలి కెళ్ళారు. విశాల భయంతో ముడుచుకుకూర్చుంది. మురళీ పండ్లూ, బిస్కట్లూ, మేగజైన్లూ వగైరాలు కొని విశాలకిచ్చాడు. బండి నిడదవోలు నుంచి కదిలింది. మురళీ విశాలను కబుర్లలోకి దింపబోయాడు కాని ఏదో భయముతో విశాల సరిగా మాట్లాడలేకపోతోంది.

ఇలా ఉండగా ఏలూరుదగ్గర ఒకముసలాయన బండిలోకి ఎక్కాడు. తిన్నగా వచ్చి మురళీకిఎదురుగా కూర్చున్నాడు. కూర్చున్న వెంటనే కళ్ళజోడు తీసి, తుడిచి కళ్లకు పెట్టుకొని మురళీకేసి, బుల్లబ్బాయికేసి, విశాలకేసి పరీక్షగా చూశాడు. మురళీకేసి మరి కొంతసేపు చూసి 'ఏ ఊరు నాయనా' అని ప్రశ్న వదిలాడు. మురళీ ఉలిక్కిపడి, కంగారుపడి, కొంచెంసేపు తటపటాయించి నోటికివచ్చిన పేరు చెప్పాడు. "నీ పేరు?" -తరువాత ప్రశ్న. 'మోహనరావు' అని చెప్పాడు. "ఆ అబ్బాయి ఎవరు? — స్నేహితుడా?"

"అవునండి."

"ఆ అమ్మాయి ఏమవుతుంది — [illegible] నాయనా?"

విశాల ఉలిక్కిపడి చూసింది. మురళీ సంకటంలో పడ్డాడు. ఈ ముసలాయన ఏమిటీ ఈ ప్రశ్న లేమిటి? ప్రాణం తీస్తున్నాడే! మురళీ నిబ్బరంగా ప్లాను వేశాడు

కాని లోకంలో వ్యవహారాలన్నీ తనుకే కావాలనే ముసలి ధాదస్తులుంటారనే విషయం ఊహించుకోలేక పోయాడు. అదే ఇప్పుడు కొంపతీసింది. బుల్లబ్బాయి. 'చెల్లె లని చెప్పరా, బాబూ' అని ప్రక్కనుంచి గిల్లగా "మా చెల్లెలండి" అన్నాడు.

"చెల్లెలా!—పెళ్లయిందా?"

"లేదండి."

"నీకు"

"లేదండి"

"అమ్మాయీ నీ పేరేమిటి?"

విశాల బిత్తరచూపులు చూస్తూ ఏమీ చెప్పలేకపోయింది. 'ఎందుకమ్మా అలా భయపడుతావు' అని అడిగాడు ముసలాయన. మురళియే చెప్పాడు 'అన్నపూర్ణ' అని. విశాల అతనికేసి చురచుర చూసింది.

"మీ నాన్నగారి పేరేమిటి?"

"గోవిందరావు అండి"

"ఇప్పుడు మీ రెక్కడికి వెళ్తున్నారు?"

"తెనాలండి"

"అక్కడ బంధువు లెవరేనా ఉన్నారా? ఎవరింట్లో ఏ శుభకార్యమేనా ఉందా?"

ఈ ప్రశ్నల వరస చూసి బుల్లబ్బాయి లేచి ప్రక్కస్టేషను రాగానే ప్రక్క పెట్టెలోకి తప్పుకున్నాడు.. బుల్లబ్బాయి వెళ్లిపోయేసరికి మురళీకి సగం ప్రాణం వచ్చింది. ఈ ముసలాయన పరీక్షకి నిలవడం ఎలా? లోపల తిట్టుకున్నాడు. ముసలాయనకు మూర్ఛ రావాలని భగవంతుడిని ప్రార్థించాడు. కాని ముసలాయన ప్రశ్నలు మరింత ఉధృతమయ్యాయి. ఆ ప్రశ్నలకు మురళీ వెంటనే సమాధానాలు చెప్పలేక తటపటాయిస్తున్నాడు. తడబడుతున్నాడు. చెప్పినది కాదని మళ్ళీ ఇంకొకటి చెపుతున్నాడు. ముసలాయన అసాధ్యుడిలా ఉన్నాడు. ప్లీడరీ చేసిఉండాలి ప్లీడరిమీద చాలా ఆర్జించిఉంటాడు. ఇలా ప్రశ్నలడిగే వారిముందు ఎవరాగగలరు మరి తన ప్రాణాలు తినేందుకు వచ్చాడీవేళ. "ఏం, నాయనా, అలా సమాధానాలు చెపుతున్నావు? ఎందుకు సందేహిస్తున్నావు. మీ చెల్లెలలా భయపడుతోంది ఎందుకు? నీతో కూడా చనువుగా మాట్లాడడం లేదేం?" అని అడుగుతున్నాడు చాదస్తపు ముసలివాడు ఎర్రని కళ్లతో.

'ఉండండి ఇప్పుడే వస్తాను' అని మురళీ లావేటరీకి దారితీసి, అక్కడినుంచి స్టేషనులో బండి ఆగగానే పెట్టెలోనుంచి దిగిపోయి బుల్లబ్బాయి ఉన్న పెట్టెలోకి ఎక్కి వేశాడు కథానాయికను ముసలాయన బారిని పడవేసి. ఆయన విశాల మీదకు దృష్టిమళ్లించాడు.

"ఏం తల్లీ అలా భయపడుతున్నావు, మీ అన్నయ్యకూడా అలా సమాధానాలు చెపుతున్నాడేం ఏమిటి కారణం" అంటూ ప్రశ్నలు కురిపించడం మొదలుపెట్టాడు. విశాల కొంతసేపు ఏమీ మాట్లాడకుండా తప్పించుకోబోయింది కాని చివరికి గుట్టు రట్టయిపోయింది. ముసలాయన ముక్కుమీద వేలు వేసుకొని హరిహరీ ఎలాంటి బుద్ధులు పుడుతున్నాయి ఈ కాలపుపిల్లలకి" అని ఆశ్చర్యపోయి అక్కడినుంచి పావు గంటసేపు నీతిబోధ చేశాడు విశాలకు పెట్టెలో వాళ్లందరికీ తెలిస్తే ఆ అమ్మాయి బాధపడుతుందని గొంతుక తగ్గించి "నీవు నాతో మాయింటికి వచ్చి వేయమ్మా, సాయంత్రం బండికి నేను మళ్ళా మీ ఊరు తీసుకువెళ్లి మీ తల్లిదండ్రులదగ్గర దిగబెట్టాను. ఆ దుర్మార్గుల్ని పోలీసులకి పట్టిస్తాను" అన్నాడు. "పోలీసులకి చెప్పవద్ద"ని బ్రతిమాలింది విశాల. బెజవాడ స్టేషను వచ్చింది. విశాలనుకూడా దిగమని ముసలాయన ఆమెను వెంటబెట్టుకొని నడిచాడు. వాళ్ళిద్దరినీ చూసి మురళీ బుల్లబ్బాయి పెట్టెలో వంగి కూర్చున్నారు. ముసలాయన ప్లాట్ ఫారం దాటి వెళ్లిపోయినతరువాత బండిదిగారు. మెల్లగా కళ్ళు తుడుచుకుంటూ ఊళ్లో ఒక హోటలు చేరారు. ఏం చేయాలో తోచలేదు. "ముసలి ముండాకొడుకు అనుకొని "ముసలివెధవ ముండాకొడుకు,"ముసలి చచ్చు వెధవ ముండా కొడుకు' అంటూ ఇద్దరూ 'వర్డ్ బిల్డింగ్' ఆడారు. కాని ప్రయోజనం లేకపోయింది. "ఇంతకీ ఆ ముసలాడెవరో! విశాల నెక్కడకు తీసుకుపోయాడో, ఏంచేస్తాడో"అని ఆ దుర్వార్తతో వెతకడానికి బయలుదేరారు. ప్రతి ఇంట్లోకి తొంగిచూస్తూ వీరిద్దరూ పోతుండడంచూసి అనుమానం వేసి కొందరు కర్రలు పుచ్చుకొని వచ్చారు. మురళీ పరుగెత్తగలిగాడు కాని బుల్లబ్బాయిమాత్రం అంతత్వరగా పరుగెత్తలేకపోయాడు. తత్ఫలితంగా బడితె బాజా అయింది అతనికి. ఇద్దరూ హోటలు చేరుకున్నారు. మురళీ హృదయంలోనుంచి కవితాధార మళ్ళీ పొంగింది. "ఉండరా బాబూ, ముందు అన్నం తిందాం, ఆపైన తీరికగా నీకవిత్వం విందాం" అని చెప్పి బుల్లబ్బాయి మురళీని భోజనాలగదిలోకి లాగుకువెళ్ళాడు. భోజనం చేసివచ్చి "ఇక నీకవిత్వం సాగించు వింటాను"అన్నాడు. మురళీ వేదనాపూరితగానం వింటూంటే బుల్లబ్బాయికి నిద్రవచ్చి, నిద్రలో వెనుక చూసిన కాలాపతారం కనిపించి, ఎగిరిపడి లేచి, ఆంజనేయదండకం వల్లించి, "ఒరే మురళీ, ఈ హోటలులో ఉండవద్దురా, ఇక్కడ పాడుకలలు వస్తున్నాయిరా" అని మాటామున్లే సర్దాడు

కథానాయకుడూ, చెలికాడూ ఇలా దేశ సంచారం చేస్తూండగా పేపర్లో ఒక ప్రకటన పడింది. "కనిపించుటలేదు. పేరు బుల్లబ్బాయి ఎత్తు నాలుగడుగుల ఎనిమిది అంగుళములు..... బులబ్బాయీ, నీకోసం మీ


ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏ క్షణం ఎలా ఉండేదీ తెలియని ఈ దినాలలో

* అగ్ని * మోటార్ కారు * కార్మిక నష్టపరిహారం
* నౌక * ఫయిడిలిటీ గ్యారంటీ * మొదలైన భీమాలకు

——మాతో సంప్రదించండి:—

యునైటెడ్ ఇండియా ఫైర్
జనరల్ ఇన్సురెన్సు కం

"యునైటెడ్ ఇండియా
ఎస్ప్లనేడ్ -

Telephone: 4841.

బ్రాంచీలు
బొంబాయి - కలకత్తా - కొలంబో -
ఢిల్లీ - పాట్నా - లక్నో - బెంగుళూరు

అమ్మ బెంగపెట్టుకొని మంచం పట్టింది. వెంటనే రావలసింది" అని ఉంది. అది చదవగానే బుల్లబ్బాయి అక్కడే కూలబడి కడివెడు నీళ్లు కార్చి "వెంటనే ఇంటికి పోదాం" అన్నాడు. మురళీ రానన్నాడు. బుల్లబ్బాయి ఎంతో చెప్పి చివరికిలాభంలేక తనకు ఉత్తరంమాత్రం రాస్తూఉండమని చెప్పి తిరుగుబండి ఎక్కాడు. మురళీమాత్రం ముందుకు సాగుతూ ప్రతిఊరులో బికారిలా తిరుగుతున్నాడు; తననొక మజ్నూగా ఊహించుకుంటూ. నెల్లూరులో ఒక పెద్దాయన అతనిని చూసి జాలిపడి తన యింటికి తీసుకువెళ్లి భోజనం పెట్టించి, తన ఆఫీసులోనే టెంపరరీగా పని ఇప్పించాడు. కాని ఆయన పడుచుభార్య మురళీపట్ల చిత్రాంగికథవంటిది జరపబోగా మురళీ మళ్లీ రోడ్డు పుచ్చుకున్నాడు.

## 6

ముసలాయన చెప్పినట్లుగానే విశాలను తీసుకొని ఆ సాయంత్రమే కాకినాడకు బయలుదేరాడు. విశాల తండ్రితో అమ్మాయి నాట్టే కేకలు వేయవద్దని చెప్పి, వెంటనే ఒక సంబంధంచూసి పెళ్ళిచేసి వేయమన్నాడు. మొదట్లో కాదన్నా చివరికామే సర్దుకోగలదన్నాడు—దేశంలో ఎంతమంది సర్దుకోవడం లేదుకాబట్టి! అలాగే విశాల తండ్రి చాలా తీవ్రంగా ప్రయత్నంచేసి ఒక సంబంధం స్థిరపరిచారు. మంచి సంబంధమే. పెళ్ళికొడుకుకి ఏభై ఎకరాల భూమి ఉంది. ఉన్నవూళ్ళో పెద్దమేడ వుంది. బాంకులో పాతికవేలు రొక్కముంది. పెళ్ళికొడుకుమాత్రం పందుకోతే.
...యినా పరవాలేదని పెళ్ళిప్రయత్నాలు
...సాగారు విశాలతండ్రి. విశాల తండ్రి
...గట్టిగా అభ్యంతరం చెప్పలేక
లోలోపలే కుమిలిపోతూ ఊరు
...నారాయణ కీ వార్త తెలిసి
అయినా తనకు కాకపోతే

గడియారం రు. 5

కాకపోనీ, విశాలకు వచ్చిన సంబంధంకూడా కావడంలేదని కొంత సంతృప్తిచెందాడు.

తిరిగి తిరిగి చివరికి మురళీ మళ్ళీ ఇంటికే చేరుకున్నాడు. తండ్రి కొడుకునుచూసి కన్నీరు పెట్టుకుని "పెద్దవాడినేదో అంటే అది పట్టించుకుంటావా నాయనా. నీవు లేకపోతే నేనీ ఆస్తేంచేసుకోను. ఎప్పటికయినా ఈ ఆస్తి నీదేకదా, నాయనా" అని "ఇంతకీ ఎవరిని ప్రేమించావో చెప్పు నిలైతే ఆ సంబంధమే చేయడానికి చూస్తాను" అన్నారు. మురళీ చెప్పాడు. "అదేమిటిరా ఈ సంబంధమే వెనుక నేను తీసుకువస్తే కాదన్నావు కదరా" అన్నారు. "ఏమిటీ!" అన్నాడు మురళీ తెల్లబోతూ. "నాకు తెలియదే ఆ సంబంధమే విశాల సంబంధ"మని. తన తెలివితక్కువకి జుట్టు పీక్కున్నాడు. పళ్లు కొరుక్కున్నాడు. "ఇప్పటికి మించిపోయింది లేదు. ఇప్పుడైనా కనుక్కుంటాను" అని తండ్రి బయలుదేరబోగా ఎవరో చెప్పారు ఆ అమ్మాయికి పెళ్ళి స్థిరమైపోయిందని. మురళీ మళ్ళీ జుట్టు పీక్కున్నాడు. చేసుకున్న కర్మ అనుకున్నాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలితే తీసి దూరంగా గిరవాటు వేయడం కర్మకాకపోతే మరేమిటి. మళ్ళీ వేదాంతంలో పడ్డాడు. వేదాంతగ్రంథాలు పఠించడం మొదలుపెట్టాడు. గడ్డం గీసుకోవడం మానివేశాడు. మరి రెండురోజులకు మురళీతండ్రి తమ చుట్టాలింట్లో శుభకార్యానికి భార్యతో కొడుకుతో కాకినాడ వెళ్లారు. బుల్లబ్బాయికూడా స్నేహితుడితో వస్తానని బయలుదేరాడు.

## 7

విశాల వివాహం తేదీ దగరపడింది. విశాల తండ్రి పెద్దయెత్తున పెండ్లిప్రయత్నం చేస్తున్నాడు. మరి పెద్ద సంబంధం చేస్తున్నప్పుడు పెద్ద ఎత్తునే పోవాలి. పెద్ద పందిళ్లు వేశారు. అలంకరణలు చేశారు. ఐదురోజులకు కార్యక్రమం ఏర్పాటుచేశారు. పదిమంది వంటబ్రాహ్మణుల్ని కుదిర్చారు. సకలవస్తువులూ సమకూర్చుకున్నారు. చుట్టాలందరూ వచ్చిపడ్డారు. లక్ష్మీనారాయణకూడా వచ్చాడు. విశాల తండ్రీ, చుట్టాలూ చాలా ఉత్సాహంగా ఉన్నారు కాని, విశాలా, ఆమె తల్లీ మాత్రం దిగులుగా ఉన్నారు. విశాల తల్లికి ఈ సంబంధం సుతరామూ ఇష్టంలేదు. డబ్బున్నంతమాత్రాన పందుకోతిని పెళ్ళాడమా, తమ్ముళ్ళకి చెప్పుకుని ఏడ్చింది. లక్ష్మీనారాయణ ముందుకూడా చెప్పి ఏడ్చింది. లక్ష్మీనారాయణ మళ్లీ ఆలోచనలో పడ్డాడు. ఆలోచించగా ఆలోచించగా అతనికొక 'బ్రెయిన్ వేవ్' వచ్చింది. 'అదీ, ఒక్క దెబ్బని రెండుపిట్టలు!' పెళ్ళిసమయంలో పెళ్లికొడుకు గైర్‌హాజరవగా సమయానికి ఉన్న ఏ మేనల్లుడికో ముడిపెట్టడం కథలు అతనికి జ్ఞాపకంవచ్చాయి. అవును తన మేనమామ పెద్దప్రయత్నం చేశాడు. ఇప్పుడు కనక సంబంధం తప్పిపోయేటట్లు చేస్తే మేనమామకు ఇంత ప్రయత్నం వృథాగా పోతూంటే ఊరుకోలేడు. తనకే యిచ్చి చేస్తాడు. మేనమామ ఇప్పటి పెళ్ళికొడుకుకిద్దామనుకున్న కట్నంలో సగం తనకేయిస్తే తనూ రాజాలా ఉండగలడు. గైకో అనుకుని మీసం, కళ్లజోడూ పెట్టుకుని పెళ్ళికొడుకు ఊరికి బయలుదేరాడు.

మగపెళ్లివారు ప్రయాణ సన్నాహం మీద ఉన్నారు. ఆ ఊరునుంచి పన్నెండు మైళ్ళు బళ్లమీదపోయి రైలెక్కాలి. పాతిక బళ్లు వచ్చాయి. పెళ్లివారందరూ భోజనాలు చేశారు రాత్రి ఎనిమిది గంటలకు బళ్లు బయలుదేరాయి. బళ్లు బయలుదేరిన తరువాత అంతవరకు దూరంనుంచిచూస్తున్న లక్ష్మీనారాయణ "శివరావూ, శివరావూ" అంటూ కేకలువేస్తూ వెనకబండి దగ్గరకు పరుగెత్తాడు. పెళ్ళికొడుకుకు తెలిసినవారెవరోఅయిఉంటారని ఆబండివారు "శివరావు మొదటినుంచి రెండో బండిలో ఉన్నాడండి. అంతవరకూ ఏం పరుగెత్తుతారు. ఇందులోనే ఎక్కండి" అన్నారు. లక్ష్మీనారాయణ ఆ బండిలోనే ఎక్కి కూర్చుని పెళ్లికొడుకు శివరావు తన పాతస్నేహితుడనీ, తన పెళ్లికి మరీ మరీ రమ్మని వ్రాశాడనీ, అందువల్ల బయలుదేరి వచ్చాననీ, దారిలో ఆలస్యమయిందనీ ఎలాగైతేనేం పెళ్లివారిబళ్లలో పడ్డానుకదా అంటూ పెళ్లికొడుకునుగురించి తెలిసినవాడిలా మాట్లాడుతూ వాళ్లదగ్గరనుంచే పెళ్లికొడుకును గురించి వివరాలన్నీ లాగాడు. కొంతసేపుండి పెళ్ళికొడుకుదగ్గరకే పోతానని చెప్పి బండి దిగి ఎదరకు వెళ్ళి శివరావును పెద్ద కేకలతో పిలుస్తూ బండి ఎక్కాడు. పెళ్ళికొడుకు ఈయ నెవరో తన చుట్టాలలో వాడని బండిలోకి ఎక్కి కూర్చోమన్నాడు. లక్ష్మీనారాయణ ఆ బండిలోకి ఎక్కి అంతకుముందు తెలుసుకున్నది ఆధారంగా చుట్టరికాలన్నీ చెపుతూ కబుర్లు చెప్పసాగాడు. బళ్లకుదుపుకు బళ్లలో వాళ్లకందరికీ జోగువచ్చింది. ఆఖరికి బళ్లతోలేవాళ్లు కూడా జోగుతున్నారు. బళ్లు రోడ్డునుబట్టి పోతున్నాయి. లక్ష్మీనారాయణ చూసి చూసి ముందుకు జరిగి తొట్లో కూర్చొని చెట్లు గుబురుగా ఉన్న ఒకచోట ఆ బండిని ప్రక్కకు పట్టి ఆపుజేశాడు. పెళ్లివారివి కాని బళ్లు మరికొన్ని వెళ్తూంటే వాటి వెనకాల తోలి, నాలుగురోడ్లు కలిసే

పోట ప్రక్కరోడ్డుకు తప్పించి కొంత దూరం తోలి వదిలివేసి వెనక్కివచ్చి ఒక బండిలోకి ఎక్కి కూర్చున్నాడు. బళ్లు స్టేషను చేరాయి. పెళ్ళివారందరూ దిగారు. సామాన్లూ అన్నీ ఒకచోట చేర్చి జనం అందరూ వచ్చారా లేదా అని చూసుకో సాగారు. పెళ్ళికొడుకే లేడు! ఇదేమిటి, బళ్లన్నీ వచ్చాయా అని బళ్లు లెక్కపెడితే పెళ్ళికొడుకు ఎక్కిన బండే లేదు. కొందరు వెనక్కి పరుగెత్తి చూశారు. ఎక్కడా బండి కనపడడం లేదు. బండివేళ అయిపోతోంది, బండిజాడ లేదు. అంతా కల్లోలంగా ఉంది. కొందరు మళ్లీ వెనక్కి పరుగెత్తారు. రైలు వచ్చింది. లక్ష్మీనారాయణ ఎవరికీ తెలియకుండా రైలు ఎక్కి కూర్చున్నాడు. పెళ్ళివారు నానాఅందోళన పడుతున్నారు. పోనీ కొందరేనా రైలెక్కి ముందుపొండి, తరువాత పెళ్ళికొడుకు మిగిలినవారూ తరువాత బండిలో వస్తామన్నారు కొందరు. ముందుపోయి ఏంచేస్తాం అన్నారు కొందరు. పెళ్ళికొడుకు జాడ ఎక్కడా లేదు. రైలు వెళ్ళిపోయింది.

పెళ్ళికొడుకు బండి ప్రక్కరోడ్డునే పడి చాలాదూరం పోయింది. ఆఖరికి ఒకఊరులో ప్రవేశించి, ఒక రైతు దొడ్లోకి వెళ్ళిపోయింది. ఎద్దులు గడ్డిమేటి దగ్గరకు బండితోనే వెళ్ళి గడ్డిమేస్తూ ఆగిపోయాయి. కొంతసేపటికి దొడ్లో ఏదో సందడి అయినట్లు గమనించి దొడ్డిగల ఆసామి తనవారిని తీసుకొనివచ్చి కేకలు వేయసాగాడు. ఆ కేకలు విని బండిలోవారు లేచి కళ్లు నలుపుకుంటూ 'స్టేషను వచ్చిందా' అంటూ దిగారు. "స్టేషనేమిటయ్యా, ఎద్దులు మా గడ్డిమేటిమీద బడి మేస్తూంటే" అంటూ అరవసాగారు. అక్కడి మనుష్యులు. పెళ్ళికొడుకూ అతని వాళ్ళు తెల్లబోయి, పరిస్థితి అర్థంచేసుకొని ఏదో పొరబాటో, మోసమో జరిగి ఉంటుందని గ్రహించి, అక్కడి మనుష్యులను బతిమాలి శాంతింపజేసి మళ్ళి బండి ఎక్కి వెనక్కి తోలుకుపోయారు.

వాళ్ళు వెనక్కి వెళ్ళేటప్పటికి ఆ పెళ్ళివారంతా నానాగగ్గోలుగా ఉన్నారు. రెండోబండికూడా వెళ్ళిపోయింది. మళ్ళి నాలుగుగంటలవరకూ బండిలేదు.

ఇక్కడ కాకినాడలో విశాల తండ్రి స్టేషనుకు వెళ్ళి పెళ్ళివారికోసం ఎదురు చూస్తున్నారు. కార్లూ, మేళాలు అన్నీ కూడా వచ్చాయి. బండి వచ్చింది కాని పెళ్ళివారు రాలేదు. విశాల తండ్రి వాళ్ళూ కంగారు పడ్డారు. ఏమీ తోచలేదు. పోని పెళ్ళికొడుకుఊరుకు 'వైరు' ఇద్దామంటే 'వైరు' త్వరగా అందేఊరు కాదది. చివరికి ఎటూ పాలుపోక ఇద్దరు బంధువుల్ని పెళ్ళివారు ఎక్కవలసిన స్టేషనుకేనా వెళ్ళిరమ్మని అటు పోయే బండి ఎక్కించి పంపారు. అందోళన పడుతూనే ఇంటికి తిరిగి వచ్చారు. చుట్టాలూ స్నేహితులూ తలకొకవిధంగా వాగుతూ ఆయనకు మరింత బెదరెక్కేటట్లు చేస్తున్నారు. కొందరు సలహా ఇచ్చారు. 'అంతా రెడీగా చేసి ఉంచుదాం, రెండో బండి ఉందికదా, దానిమీద వస్తూ ఉండవచ్చు. పెళ్ళికొడుకు రావడమే తరువాయి తిన్నగా పీటలమీద కూర్చోపెట్టి కానిచ్చేద్దాం' అని. ఆలాగేనని కార్లనీ, బండు మేళాన్నీ స్టేషనుకు పంపించి ఇక్కడ అన్నీ సిద్ధంచేసి కూర్చున్నారు. మరి కొంత సేపటికి వట్టి కార్లూ, మేళం, తిరిగి వచ్చాయి. విశాలతండ్రికి పిచ్చెత్తి పోయినట్లయింది. పెళ్ళివార్ని తిట్టారు. ఊళ్లో వాళ్లని తిట్టారు. ఆఖరికి ఎదురుగా ఉన్న వాళ్లని కూడా తిట్టారు. "ఇంత ఇలా మోసం చేస్తారా. ఇంత ఖర్చు పెట్టాను, ఇంత ప్రయత్నం చేశాను, ఇదంతా ఊరికే పోవలసిందేనా. కాస్తా కూస్తానా—" అని పదిసార్లు అటూ ఇటూ తిరిగి "ఒరే లక్ష్మీనారాయణ నీకే ఇచ్చి చేసిస్తాను తయారు కారా. ఇంత ప్రయత్నం ఊరికే పోకూడదు. అసలాసంబంధం వద్దని తల్లీకూతురు లేకుస్తూనే ఉన్నారు. నీకే రాసి ఉంది. తయారవు" అన్నారు. అందరూ "అవును ఎలాగైనా మేనరికమేగదా" అన్నారు. లక్ష్మీనారాయణ గుండె రెండు చేతుల తోటి గట్టిగా అదిమి పట్టుకున్నాడు.

## 8

విశాల పెళ్ళి ఆవేళవని మురళీకి తెలిసింది. కాని అతను పెద్దగా బాధపడలేదు. బాధకూడా తెలియకుండా మొద్దుబారిపోయింది మనస్సు ఈ మధ్య పట్టించుకున్న వేదాంతంతో. అయినా ప్రేయసి సుఖంగా ఉండడమే ప్రియుడికి కొంత ఊరట అనే దృష్టితో విశాలకు తన హార్దికాభినందనలు తెలియపరచి రావాలనుకున్నాడు. బుల్లబ్బాయితో చెప్పాడు. "అలాగే పోదాం ముందు కాస్త గడ్డం గీసుకోరా, బాబూ" అని గడ్డం గీయించి, మంచి దుస్తులు వేయించి పెళ్లివారింటికి బయలుదేరాడు బుల్లబ్బాయి మురళీతో.

విశాలతండ్రి మురళీ అటు రావడం చూసి లోపలికి ఆహ్వానించి కూర్చోమన్నారు. లోపలికి పోయినప్పుడు కూతురుతో "మాశావా అమ్మాయీ, ఆ అబ్బాయి రాజాలా ఉన్నాడు. అతని సంబంధం తీసుకువస్తే అది కాదన్నావు" అన్నారు. "ఏ సంబంధం" అని ఆ అబ్బాయికేసి చూసింది. మురళీ! తన మురళీ! "ఈ సంబంధ మెప్పుడూ నాతో చెప్పందే!" అంది.



అబ్బా! ఒకే జలుబు...భారము...

అమృతాంజనం వాడితే...

తగ్గిపోయింది !
అమృతాంజనము


"నేను అబద్ధాలకోరుననీ, మోసగాణ్ణని మీ పత్రికలో నేనా వేశారు?" అని రాజకీయవాది సంపాదకుణ్ణి నిగ్గదీసి అడిగాడు.

"మా పత్రికలో కాదండి. అవతల వీధిలో మా సమకాలిక పత్రిక అయిఉంటుంది. మాదాంట్లో కొత్త వార్తలు మాత్రమే వేస్తాము"

"చెప్పకపోవడ మేమిటి ఫోటో కూడా చూపిస్తే!" "ఫోటో చూపించందే నా కొప్పను". "చూపించకపోవడ మేమిటి చూపిస్తే—పోనీ ఇప్పటికీ నా మించిపోయింది లేదు అతనంటే ఇష్టమేనా చెప్పు" అన్నారు. విశాల నిలువెల్లా సిగ్గుతో నిండిపోయి మాట్లాడలేకపోయింది. తల్లి చూసి "చెప్పవే ఇప్పుడైనా" అని అడిగింది "అతనినే నేను చేసుకుంటానన్నది" విశాల మెల్లగా. తలీ తండ్రీ విశాలకేసి ఆశ్చర్యంగా చూశారు. చివరికి పెద్దగా నవ్వివేశారు తండ్రి మురళీదగ్గరకు పరుగెత్తి "మీ నాన్నగారు, అమ్మగారు మీ ఊళ్లోనే ఉన్నారా?" అని అడిగారు. "లేరు, ఈ ఊళ్లోనే ఉన్నారండి" అని చెప్పాడు మురళీ వెంటనే కారు వెళ్లింది వారిని తీసుకురావడానికి. ఈలోపుగా మురళీని పీటల మీద కూర్చోబెట్టమన్నారు విశాల తండ్రి. పాటొకడిదయితే పంట ఒకడిదయింది లక్ష్మీనారాయణ ఒక స్తంభం దగ్గర కూలబడిపోయి నాలుగు కప్పుల కాఫీ త్రాగివేశాడు.

వధువు తల్లిదండ్రులు వరుడి కాళ్లు కడగబోతున్నారు అంతలో వచ్చిపడ్డాడు శివరావు చుట్టాలతో "నేను వచ్చాను, నేను వచ్చా" నంటూ పెళ్లిపందిరంతా నిశ్శబ్దమైపోయింది. ఎక్కడివారక్కడ శిలావిగ్రహాల్లా అయిపోయారు "నేను వచ్చానంటే మాటాడరేం ఏయ్ ఆ పెళ్లి ఆపేయండి నేనూ పెళ్ళి చేసుకోవలసింది ఎవడో బద్మాష్ మా బండిని తప్పుదారి పట్టించి పారిపోయాడు. వాడు కనిపిస్తే వాడి పేగులు తీసి నా మెడలో వేయకపోతే నా పేరు శివరావు కాదు" అన్నాడు శివరావు. ఆ మాటలు విని లక్ష్మీనారాయణ ప్రక్కగోడదూకి స్టేషనుకు పరుగెత్తి రాజమండ్రీ బండి ఎక్కి ఉడాయించాడు.

శివరావు తక్కిన చుట్టాలందరూ కూడా వచ్చారు. పెద్ద కజ్జా లేవదీశారు. పెళ్లి పందిరైనా ఊడబీకి పోతాం కాని ఊరికే పోమన్నారు. విశాలతండ్రికి మళ్లీ ఆశ పుట్టుకు వచ్చింది "లక్ష రూపాయిల సంబంధం!" సందిగ్ధావస్థలో పడ్డాను. "అయ్యా ముహూర్తం వేళ సమీపిస్తోంది" అన్నారు పురోహితులు. శివరావు మురళీదగ్గరకు పరుగెత్తుకుపోయి, "లేవయ్యా, లే, నీలు దొరికిందని మధ్యలో వచ్చి కూర్చోవడమే! అసలు నీవాడే ఎవడో ఆ పని చేశాడు. సిగ్గు లేదయ్యా, మనిషీ లేలే" అంటూ రెక్క పుచ్చుకొని గుంజివేయసాగాడు "లేవకురా బాబూ ఏమైనా" అని బుల్లబ్బాయి గోలపెట్టూనే ఉన్నాడు కాని మురళీకి మళ్లీ వైరాగ్యం వచ్చి లేచిపోయాడు. "మంగళాస్నానం లేదు గింగళాస్నానం లేదు. కానియ్యవయ్యా పురోహితుడా" అంటూ పీటమీద కూలబడ్డాడు శివరావు. భజంత్రీలు మ్రోగాయి.

మురళీ మజ్నూ కాక తప్పలేదు. ★




కాశ్మీరు శాలువ

రు. 2-8-0 మాత్రమే

96" × 54",
కొంతల కాశ్మీరు శాలువ రు 2-8-0

పోస్టేజీ అదనం స్టాకు పరిమితంగా ఉంది. విలాసం ఇంగ్లీషులో వ్రాయండి:

KASHMIRI SHAWL HOUSE,
Durgiana (A P W) Amritsar.

శుద్ధమైన సువాసనగల మంచి కాఫీ

మీరు సులభంగా కొనగల ధరకు!




స్టేన్స్ ఎఱ్ఱలేబిల్ ప్యూర్ కాఫీ

THE PICK OF THE SOUTH

స్టేన్స్ ఎఱ్ఱలేబిల్ ప్యూర్ కాఫీ కొరిన రుచి నిచ్చేగాక మీకు ఎన్నోకప్పుల కాఫీయగును. ప్రతి ప్యాకెట్టుపై స్టేన్స్ పేరుచూచి మరీ కొనండి. సాటిలేని నాణ్యతకు అదే మీ గ్యారంటీ స్టేన్స్ ఎఱ్ఱలేబిల్ ప్యూర్ కాఫీ తాజాగా గాలిచొరనట్లు ప్యాక్ చేయబడి ½, 1, 3, 7, 14&20 పౌన టిన్నులలో లభించును

ప్రతియొక్కరు కొనదగు చక్కని కాఫీ!

STC 4058

ది యునైటెడ్ కాఫీ సప్లై కంపెని లిమిటెడ్
కోయంబుత్తూరు, దక్షిణ ఇండియా.

కాకినాడ ఏజెంటు: శ్రీ కరణం హనుమంతరావు, ఈశ్వరనివాస్, తిరుమలరావువీధి, కాకినాడ, విజయవాడ ఏజెంటు, శ్రీ ఎస్. సి. హెచ్. మల్లపరాజు, మాన్యుఫాక్చరర్సు ప్రతినిధి, బకింగుహాం పేట, పోస్టు, విజయవాడ.